కొత్త ఎంఈవోల నియామకం

- ఇప్పటివరకు ఎంఈవోలు లేని గాజువాక, పెదగంట్యాడ
- ఇన్‌చార్జి ఎంఈవోలతోనే నెట్టుకొచ్చిన విద్యాశాఖ
- మండలాలు ఏర్పడిన దశాబ్దాల తరువాత నియామకం


గాజువాక ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన సునీత


పెదగంట్యాడ ఎంఈవో రమణాజీని అభినందిస్తున్న సిబ్బంది

గాజువాక: గాజువాక, పెదగంట్యాడ మండలాలకు విద్యా శాఖాధికారులు నియమితులయ్యారు. గాజువాక ఎంఈవోగా సునీత, పెదగంట్యాడ ఎంఈవోగా రమణాజీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. దశాబ్దాలుగా ఎంఈవోల నియామకానికి నోచుకోని ఈ రెండు మండలాలకు కొత్తగా అధికారులను నియమించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గాజువాక, పెదగంట్యాడ మండలాలు ఏర్పడినప్పటి నుంచీ ఇక్కడ ఎంఈవోలు లేని విషయం తెలిసిందే. ఇప్పటివరకు పెందుర్తి మండల విద్యాశాఖాధికారి తన మండలంతో పాటు గాజువాక, పెదగంట్యాడ, చినగదిలి మండలాలకు విద్యాశాఖాధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. దీంతో ఆయా మండలాల్లో విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ, పరిపాలన నామమాత్రమైపోయింది. ఇక్కడి సమస్యలను కూడా ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కార చర్యలను చేపట్టడంలోనూ జాప్యం చోటుచేసుకొనే పరిస్థితి ఉంది. ఈ విషయాలను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలకు విద్యాశాఖాధికారులు ఉండాలనే విధంగా ఉత్తర్వులను జారీ చేయడంతో గాజువాక, పెదగంట్యాడ మండలాలకు ఎంఈవోలు నియమితులయ్యారు. గాజువాక ఎంఈవో సునీత గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేశారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన నూతన అధికారులను పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రధాన గెడ్డల్లో పూడికలు తొలగించండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలు
- 76వ వార్డులో పర్యటన


గంగవరం పోర్టు వంతెన సమీపంలో గెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని ప్రధాన గెడ్డల్లో పూడికలు తక్షణమే తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఆయన జీవీఎంసీ జోన్-6 పరిధిలోని 76వ వార్డులో గల జగ్గు జంక్షన్, కణితిరోడ్డు, పెదగంట్యాడ, నడుపూరు, ఏపీహెచ్‌బీ కాలనీ, గంగవరం పోర్టు రోడ్డులోని ప్రధాన గెడ్డలను కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. కణితి రోడ్డులోని ప్రధాన గెడ్డ నుంచి నీరు రోడ్లపైకి వస్తోందని, ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద గల గెడ్డను వెడల్పు చేయాలని సూచించారు. పెదగంట్యాడలోని శివాజీ పార్కును అభివృద్ధి చేయాలని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు కమిషనర్‌ను కోరగా.. గంగవరం పోర్టు, స్టీల్ ప్లాంట్ అధికారులతో చర్చించి సీఎస్సార్ నిధులతో పార్కు అభివృద్ధి చేసేలా చూస్తామని కమిషనర్ తెలిపారు. పర్యటనలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్, ఏఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో సుభోజనం

అగనంపూడి: స్థానిక హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మరియు పరిశోధనా కేంద్రం ఆవరణలో రోగుల సహాయకులకు సోమవారం నుంచి సుభోజనం అందుబాటులోకి రానుంది. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో టచ్ స్టోన్ ఛారిటీస్ సహకారంతో కార్యక్రమాన్ని చేపడుతున్నామని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి, సుదూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే క్యాన్సర్ బాధితులు, వారి సహాయకులు ఆవరణలో తినుబండారాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని, వీటిని దృష్టిలో పెట్టుకొని సుభోజన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం మూడు వందల మందికి మధ్యాహ్న భోజన వసతి ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక స్పందన నేడు

పెదగంట్యాడ: మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక స్పందన నిర్వహించనున్నామని తహసీల్దార్ రమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వెళ్లిరావడం పేదలకు దూరాభారం కావడంతో, ఇక్కడ ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని సూచించారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

కల్చర్ ఫౌండేషన్ వితరణ


పేదలకు సరకులు పంపిణీ చేస్తున్న అప్పారావు

పెదగంట్యాడ: పేదలను ఆదుకునేందుకు తమ వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పేర్ల అప్పారావు తెలిపారు. గంగవరం గ్రామంలోని పేదలకు సోమవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఫౌండేషన్ సభ్యులు కంభంపాటి అరుణ, చిరంజీవి దంపతుల ఆర్థిక సాయంతో వీటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో గిరిచరణ్‌నాయుడు, శివప్రసాద్, మధు, ప్రసాద్, హేమంత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు


ఆశ్రమానికి సరకులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని ఆ పార్టీ గాజువాక నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మదర్ థెరిసా అనాథాశ్రమానికి రూ.10వేల విలువైన నిత్యావసర సరకులను అందజేశారు. అనంతరం బర్త్ డే కేక్‌ను కట్ చేసి, స్వీట్ పంచారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, యరబాల భూలోక, ఎం.వర్మ, కె.అప్పారావు, ఎస్.వీరారావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో..

అక్కిరెడ్డిపాలెం: రాహుల్ గాంధీ జన్మదినోత్సవం సందర్భంగా భెల్‌లోని ఇంటక్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంపా గోవిందరాజు కేక్ కట్ చేశారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గవర వెంకటరమణారావు, భెల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన వలంటీర్లకు నియామక పత్రాలు


నియామకపత్రం అందుకుంటున్న వలంటీర్

గాజువాక: నియోజకవర్గంలోని వివిధ వార్డుల్లోని సచివాలయాల పరిధిలో కొత్తగా నియమితులైన 64 మంది వలంటీర్లకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నియామక పత్రాలను అందజేశారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ఈ వ్యవస్థ వల్ల పథకాలు నేరుగా సమర్థవంతంగా అందుతున్నాయన్నారు. పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందించడానికి వలంటీర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, గాజువాక జోనల్ సూపరింటెండెంట్ కె.రమణ, యూసీడీ ఏపీడీ ఎల్.రాము, 64వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ధర్మాల శ్రీను, నాయకులు నాగిశెట్టి శ్రీను, కమల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి దేవాలయంలో వారాహి నవరాత్రులు ప్రారంభం


ఆదివారాహిదేవి అవతారంలో శ్రీమహాదుర్గ అమ్మవారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో వారాహీ నవ రాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాడ శుద్ధ నవమి వరకు అమ్మ వారిని వివిధ అవతారాల్లో అలంకరించనున్నారు. తొలిరోజు సోమవారం శ్రీమహాదుర్గను ఆదివారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర శ్వేత పుష్పార్చన నిర్వహించారు. విఘ్న ఆటంక, ప్రతికూలత నివారణ జరిగేలా చూడాలంటూ ప్రార్థనలు చేశారు. అంతకు ముందు వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుమలనగర్ సంక్షేమ సంఘానికి ప్రశంసలు


సంక్షేమ సంఘం ప్రతినిధులకు సర్టిఫికెట్ అందిస్తున్న జీవీఎంసీ అధికారులు

కూర్మన్నపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఎకో వైజాగ్‌కు తమ వంతు కృషి చేస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులను జీవీఎంసీ ఆదనపు కమిషనర్ సన్యాసినాయుడు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ అభినందించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ప్లాస్టిక్ నిషేధం, డ్రై డే, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలను కాలనీలో అమలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంగా తిరుమల నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాగభూషణం, పరమానందం, సత్యనారాయణ, తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న యాజమాన్యం

ఉక్కునగరం: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను డీఏవీ పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ నెల 10 నుంచి 13 వరకు మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన వాలీబాల్ 66వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో బాలికల అండర్-19 విభాగంలో ఆల్ ఇండియా డీఏవీ యూనిట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో బృంద సభ్యులు జి.మోనిక్, శ్రీవల్లి, ఎస్. ఝాన్సీలక్ష్మి, సీహెచ్. వైష్ణవి, మోక్షజలను పాఠశాల ఎల్ఎంసీ కమిటీ చైర్మన్ కె. సంజీవరావు, ప్రిన్సిపాల్ నైస్ షాజి అభినందించారు.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు మానవత్వ సేవా చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మిషన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ద్వారా మెరిట్ స్కాలర్‌షిప్‌లను సోమవారం అందజేశారు. కణితి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.ఎస్.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ట్రస్ట్ అండగా నిలవడం అభినందనీయమన్నారు. హైస్కూల్లో పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ట్రస్ట్‌ను సంప్రదిస్తే వారికి కావలసిన సహాయ, సహకారాలను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై సీపీఎం ఆందోళన


ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక: విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. వందడుగుల రోడ్‌లోని చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచిందని, విద్యుత్ మీటర్లకు స్మార్ట్ మీటర్లను అమర్చే యోచనలో కూడా ఉందని ఆరోపించారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.లోకేష్, జి.లక్ష్మి, వై.లక్ష్మణరావు, కె.పి.కుమార్, ఆర్.స్వర్ణలత, కె.సంతోషం తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద..

కూర్మన్నపాలెం: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం స్టీల్ డివిజన్ నాయకుడు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలియజేశారు. శ్రీనివాసరాజు, వై.టి.దాస్, నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద..

పెదగంట్యాడ: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని పెదగంట్యాడ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.రామారావు, సీపీఎం స్టీల్‌జోన్ నాయకులు కొవిరి అప్పలరాజు, బైరెడ్డి గురప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి, దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ నాయకుడు కురందాస్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పేద మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సీతానగరంలోని శివరామకృష్ణ ఆలయంలో కేక్ కట్ చేసి, పంచారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పేదలకు చీరలతో పాటు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నక్క వెంకటరమణ, వియ్యపు చంద్రరావు, చట్టి సింహాచలం, కొరిబిల్లి అప్పారావు, ఉరుకూటి సింహాచలం, కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట


మింది హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలను అందుకున్న విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేపట్టి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని 68వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ అన్నారు. మింది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచి, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించారు. స్కూల్ టాపర్‌గా నిలిచిన మేడబోయిన హర్షితకు రూ.3 వేల నగదు పురస్కారం, గోల్డ్ మెడల్, విద్యాశాఖ అందించిన సర్టిఫికెట్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన రోనంకి కళ్యాణికి రూ.2 వేలు నగదు పురస్కారం, సిల్వర్ మెడల్, సర్టిఫికెట్, తృతీయ స్థానంలో నిలిచిన బోనంగి కావ్యకు రూ.1000 నగదు పురస్కారం, బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

858వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


858వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కార్మికులు చేస్తున్న ఉద్యమం వారి పోరాట పటిమకు నిదర్శనమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 858వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. మహనీయుల ప్రాణత్యాగాలతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై దేశంలోని కార్మికులందరూ ఐక్యమై పోరు సాగిస్తామన్నారు. ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్యపై అధికారుల పరిశీలన


స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఈ

పెదగంట్యాడ: మండలంలోని నడుపూరు గ్రామంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని ఏపీఈపీడీసీఎల్ పెదగంట్యాడ ఏఈ డి.శివదుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామంలో నిత్యం లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ముబీనా బేగం అనే మహిళ ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఈ దుర్గాప్రసాద్ ఆ ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. విద్యుత్ వైర్లను తాకుతున్న కొమ్మలను నరికి వేయాలని సిబ్బందిని ఆదేశించారు. వైర్లు పరిశీలించాలని, పాడైన వాటిని మార్చివేయాలన్నారు. పాత కెపాసిటర్లను తొలగించి కొత్త వాటిని వేయాలని సూచించారు.

నేడు దుర్గమ్మ అనుపోత్సవం


విశేష అలంకరణలో దుర్గమ్మ తల్లి

గాజువాక: స్థానిక బీసీ రోడ్‌లోని కాకతీయ లోవలో దుర్గమ్మతల్లి పండగ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 18న ప్రారంభమైన పండగ మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి మంగళ స్నానాలను చేయించగా, రెండో రోజైన సోమవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా వీధుల్లో ఘటాలను ఊరేగించారు. ముగింపుగా మంగళవారం భారీగా అనుపోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఉదయం ఐదు గంటలకే ఉత్సవాలను ప్రారంభించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అమ్మ వారి సర్వదర్శనం కల్పిస్తారు. ఉత్సవం సందర్భంగా ఘటాల ఊరేగింపు, పులి వేషాలు, కోలాటాలు, గరిడీ, డప్పులు, తాశాలు తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సినీ ఆర్టిస్ట్‌లకు హెల్త్‌కార్డుల పంపిణీ


సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సభ్యులకు హెల్త్‌కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని పలువురు సభ్యులకు హెల్త్‌కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, మురళీ, వర్మ, సురేష్, జేటీ రామారావు, వాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న నగర మేయర్


తిరుమలలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి దంపతులు

డాబాగార్డెన్స్: విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్వామి దయతో జగనన్న ప్రభుత్వం ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని, వెంకన్నస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండాలని కోరుకున్నట్టు ఆమె చెప్పారు.

అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

మద్దిలపాలెం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తున్నామని యూనివర్సిటీ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్. విజయకృష్ణారెడ్డి ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్‌లో అడ్మిషన్ల కోసం www. braouonline. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన డిగ్రీ విధానంపై 21న సదస్సు

గాజువాక : నూతన విద్యా విధానం-2020లో భాగంగా డిగ్రీ విద్యా విధానంలో చోటు చేసుకున్న మార్పులపై ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తెలిపారు. నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీలో భాగంగా సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవడం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సుల్లో సందేహాలను ఈ సదస్సులో నివృత్తి చేసుకోవచ్చని తెలియజేశారు. ఉదయం 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, ఇంటర్ పాసైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావచ్చని తెలిపారు.

సైకిల్‌పై జీవీఎంసీకి కమిషనర్


సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్ వర్మ

డాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణకై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం తిరిగి సైకిల్‌పైనే బంగ్లాకు వెళ్లారు.

కాలుష్య నియంత్రణకు కనీసం వారానికి ఒక రోజైనా నగర ప్రజలు తమ సొంత వాహనాలు వదిలి, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని కమిషనర్ కోరారు.